పోటీ పరీక్షల అభ్యర్థులకు గ్రంథాలయాలు ఉపయోగకరం

● బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్ : వివిధ రకాల పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం బడంగ్‌పేట్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేడుకలకు ఆహ్వానం

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం నిర్వహించనున్న కార్తీక పౌర్ణమి మహోత్సవానికి విచ్చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు ఆలయ ఈఓ ఎన్.లావణ్య, దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణితో కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు. వేద పండితులు దైత సుబ్రహ్మణ్య పవన్‌కుమార్‌శర్మ, చంద్రకాంత్‌శర్మ, ముత్యాలుశర్మ, అర్చకులు కందాళ సంతోష్‌కుమార్, జిన్నా సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి పాల్గొన్నారు.

సరూర్‌నగర్ ప్రధాన రహదారి విస్తరణకు చర్యలు : జెడ్సీ

ఎల్‌బీనగర్ : సరూర్‌నగర్ ఓల్డ్ పోస్టాఫీస్ చౌరస్తా రహదారి విస్తరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. బుధవారం కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్‌ను కలిసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరిన విషయం విధితమే. స్పందించిన జోనల్ కమిషనర్ గురువారం ఉదయం కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి అంజన్, దరిపల్లి రాజశేకర్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేశారు. రోడ్డు విస్తరణ 100 అడుగులకు అంచనాలు రూపొందించాలని టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులను జోనల్ కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో స్థానికులతో పాటు సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, ఈఈ శ్రీనివాసులు, శానిటేషన్ డీఈ చందన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

హయత్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ సమాచార కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈనెల 16న విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్‌పోటీలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథపాలకుడు ఆనందం దుర్గాప్రసాద్, కళాశాల అకాడమి కోఆర్డినేటర్, నర్సింహ, అధ్యాపకులు ఇందిర, యాదగిరి, సుబ్రహ్మణ్యం, మక్లా, విద్యాసాగర్, అవేస్, బాల నర్సింహ, మధు, వెంకటలక్ష్మి, మహ్మద్, కృష్ణమోహన్, ప్రవీణ్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జయలక్ష్మి, ఉదయనాయక్ పాల్గొన్నారు.

చంపాపేట : విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని సరూర్‌నగర్ ఎంఈఓ బాసునాయక్ తల్లిదండ్రులను కోరారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం చంపాపేటలోని ప్రభుత్వ కేంద్ర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, పురేందర్‌రెడ్డి, జి.రజిత, అజిత, వినయ్‌కుమార్, బి.రజిత, కావ్యారెడ్డి, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ : మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తారామతిపేట జడ్పీహెచ్‌ఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న అధ్యాపకులు

ఈ సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎరుకల సుమలత, ఉపాధ్యాయులు ఎర్రయ్య, జ్యోతి, మహిపాల్, రమేష్‌రావు, వెంకట్‌రాంరెడ్డి, నాగజ్యోతి, నర్సింహారెడ్డి, రమేష్, యాదమ్మ, మహేందర్, పరుశురాం, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

తట్టిఅన్నారం స్కూల్‌లో..

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గీతావేణుగోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆలయ ముఖద్వార నిర్మాణ పనులకు భూమిపూజ

చంపాపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లోని భవానీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అనంతరం హనుమాన్ దేవస్థానం మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో హనుమాన్ ఆలయ మాజీ ధర్మకర్త అంజిరెడ్డి, ఆయా పార్టీల నాయకులు బొక్కా సదానంద్‌రెడ్డి, చీర శ్రీనివాస్, చేగోని మల్లేష్‌గౌడ్, నిషికాంత్‌రెడ్డి, గౌతంరెడ్డి, బాలకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, సత్తిరెడ్డి, బొంబాయి, జగదీష్‌గౌడ్, యాదగిరి, శివగౌడ్, మహేష్, నిర్వాహకులు లక్ష్మయ్య, వసంత్, పురుషోత్తం, నవీన్, బాలు, విజయ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ భూమిపూజ

కర్మన్‌ఘాట్‌లోని ఓల్డ్‌విలేజ్‌లోని భవానీ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం నిర్మాణ పనులలో గురువారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పాల్గొని భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మయ్య, నవీన్, వసంత్‌కుమార్, పురుషోత్తం, బాల్‌రాజ్, విజయ్, బాబురావు, రాజు పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్‌లోని నాగలింగేశ్వరస్వామి ఆలయ ముఖద్వార నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి





భారీ ర్యాలీ చేపట్టిన మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య

పెండింగ్ స్కాలర్‌షిప్పులు చెల్లించకుంటే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తాం: ఆర్. కృష్ణయ్య

ఎల్‌బీనగర్ : రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ల కోసం కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తూ చదువుకునే విద్యార్థులకు మాత్రం స్కాలర్‌షిప్పుల బకాయిలు చెల్లించడం లేదని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్పులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపల్లి అంజి ఆధ్వర్యంలో గురువారం ఆర్‌కేపురం నుంచి కొత్తపేట చౌరస్తా వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులను తక్షణమే విడుదల చేయకపోతే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని హెచ్చరించారు. బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు వెంకటేశ్, సతీష్, రవీందర్, అనంతయ్య, రాందేవ్, మహేష్ పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభించిన ఏసీపీ కృష్ణయ్య

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మన్సూరాబాద్ : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రాక్‌టౌన్ కాలనీలో గల రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య గురువారం చింతల అరుణతో కలిసి ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఎస్‌ఐ ప్రసాద్, రాక్‌టౌన్ కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, సిద్దాల ఐలయ్య, పాల్వాయి సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలయాలు, మహిళలు, గోవులపై దాడులను అరికట్టకుంటే ఆత్మార్పణ చేసుకుంటా

● చైతన్యపురిలో అఘోరి వ్యాఖ్యలు

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లపై చేయి వేస్తే.. పురుషాంగాన్ని కోసేస్తానని, త్వరలోనే ఓ ఘటన జరగబోతోందని అఘోరి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం చైతన్యపురిలో బీజేపీనేత, సామాజిక కార్యకర్త మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా కార్యాలయానికి వచ్చిన అఘోరి కార్తీకమాసం తర్వాత తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. హిందూ దేవాలయాలు, మహిళలు, గోవులపై దాడులను అరికట్టకుంటే తాండవం చేసి, ఆత్మార్పణ చేసుకుంటానని హెచ్చరించారు. కుంభమేళా తర్వాత తన కార్యాచరణను మరింత ఉధృతం చేస్తానన్నారు. హిందువులంతా ఐక్యంగా ఉండి, హిందు ధర్మంపై జరుగుతున్న దాడిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆలయాలను ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. దుండగులపై చట్టపరమైన చర్యలు చేపట్టకుంటే పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.



మీడియాతో మాట్లాడుతున్న అఘోరి

సైలెన్సర్ మార్చి భయభ్రాంతులకు గురిచేసిన బైకు రైడర్

● బైకు స్వాధీనం, రూ.4500 విలువైన పెండింగ్ చలానాలు

కొత్తపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బైకు సైలెన్సర్ మార్చి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసిన బైకు రైడర్‌పై ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు చర్యలు తీసుకున్నారు. ఎల్బీనగర్ మాల్ మైసమ్మ ఫ్లైఓవర్, కొత్తపేటచౌరస్తా, అల్కాపురిచౌరస్తా పరిసర ప్రాంతాల్లో కొందరు యువకులు మధ్యాహ్నం, రాత్రి విపరీతమైన శబ్దం వచ్చేలా సైలెన్సర్ మార్చేసిన బైకును అతివేగంగా నడుపుతూ ఇతర వాహనదారులను, ప్రయాణికులనూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బుధవారం రాత్రి కొత్తపేట చౌరస్తాలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో దిల్‌సుఖ్‌నగర్ పీ అండ్ టీ కాలనీకి చెందిన విద్యార్థులు చేతన్‌కుమార్, శివ విపరీతంగా శబ్దం వచ్చేలా బైకు సైలెన్సర్ మార్చేసిన బైకును వేగంగా నడుపుతూ ప్రయాణికులను, ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు శబ్ధకాలుష్యం చేశారు. వారిని పట్టుకుని బైకును స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వారితో మాట్లాడి వారికి నోటీసు అందజేశారు. కోర్టుకు హాజరైన తర్వాత జరిమానాతో పాటు, ఆ బైకుపై ఉన్న రూ.4500 పెండింగ్ చలానాలు చెల్లించాలని, ట్రాఫిక్ పీఎస్‌లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని నోటీసు ఇచ్చారు.







కొల్లాపూర్ మామిడి రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : మామిడి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు మార్కెట్ పాలకవర్గం సిద్ధం గా ఉన్నదని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. మార్కెట్‌లో రైతులకు ఎలాంటి కష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన మామిడి రైతులు గురువారం బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో చైర్మన్ మధుసూదన్‌రెడ్డిని కలిసి సీజన్‌లో రైతులకు ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రైతులు చెప్పిన ప్రతి సమస్యను చైర్మన్ నోట్ చేసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మామిడి పం డించే రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మామిడి సీజన్‌కు అనుగుణంగా మార్కెట్‌లో వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.